సాక్షి
రంగారెడ్డి
గురువారం । 12 । జనవరి । 2023



## లారీల నుంచి డీజిల్ చోరీ

జాతీయ రహదారిపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటున్నా లారీలు, వాహనాల నుంచి డీజిల్, పెట్రోల్ చోరీ ఆగడం లేదు. 8లో▸



## మైదానాల ఏర్పాటుకు కృషి

అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸

## 25 నుంచి ఏషియా జ్యువెల్ ఎక్స్‌పో

బంజారాహిల్స్: ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన 50 ఆభరణాల బ్రాండ్స్‌ను ఒకే గొడుకు కిందకు తీసుకొస్తూ ఈ నెల 25 నుంచి 27వరకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఏషియా జ్యువెల్స్‌షో- 2023 నిర్వహిస్తారు. సన్నాహక కార్యక్రమాన్ని బుధవారం బంజారాహిల్స్‌లో నిర్వహించారు. సినీ తారలు అనన్య నాగళ్ల, శ్రీ లేఖ పాల్గొన్నారు.

# ప్రేమ పంచని పేగుబంధం!

గోరుముద్దలు తినిపించిన అమ్మకు తిట్లు.. భుజాన ఎత్తుకొని ఆడించిన నాన్నకు ఛీత్కారాలు.. ప్రభుత్వం అందిస్తున్న 'ఆసరా' ఇవ్వాలంటూ దాడులు.. లేదంటే ఇంటి నుంచి గెంటేస్తున్న వైనం. ఇదీ.. పండుటాకుల నిత్య వేదన. ఇళ్లు, స్థలాలు, ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను భారంగా భావిస్తున్న కొంతమంది.. జీవిత చరమాంకంలో వారికి నరకం చూపిస్తున్నారు. వయోభారంతో ఇబ్బంది పడుతున్న బాధితులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

### బతికుండగానే నరకం చూస్తున్న వృద్ధులు

- కన్నవారి ఛీత్కారాలు, భరించలేని వేధింపులు
- ఆస్తిపాస్తులు లాక్కుని.. ఆగం చేస్తున్న బిడ్డలు
- బలవన్మరణాలకు పాల్పడుతున్న పండుటాకులు
- వయోవృద్ధుల సంక్షేమ శాఖ కాల్ సెంటర్‌కు పోటెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట వృద్ధులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆఖరి మజిలీలో అండగా నిలవాల్సిన కన్న పిల్లలే వారి పాలిట కర్కోటకులుగా మారుతున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను భారంగా భావించి కర్కషంగా ప్రవరిస్తున్నారు. జిల్లాలో 60 ఏళ్లు దాటిన 84,496 మంది వృద్ధులు ఉండగా, వీరికి ప్రభుత్వం నెలకు రూ.2,016 చొప్పున పెన్షన్ అందిస్తోంది. ఈ డబ్బులను కూడా కొడుకులు, కోడళ్లు, మనవళ్లు బలవంతంగా లాక్కుంటున్నారు. ఇతరులకు చెబితే పిల్లల పరువు పోతుందనే భయంతో మౌనంగా భరిస్తున్నారు.



వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోతీకి తమ సమస్యను చెప్పుకొంటున్న వృద్ధులు

#### పెరిగిన వేధింపులు

పేద, ధనిక అనే తేడా లేకుండా వృద్ధ తల్లిదండ్రులపై వేధింపులు కొనసాగుతున్నాయి. అంతో ఇంతో ఆస్తిపాస్తులున్న సంపన్న కుటుంబాల్లోనే ఇవి ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. గ్రేటర్ జిల్లాలో సాధారణ సమయంలో 28.6 శాతం మంది వయోవృద్ధులు తమ పిల్లల నుంచి నిర్లక్ష్యానికి గురైతే.. కోవిడ్ తర్వాత ఈ సంఖ్య 60శాతానికి పెరిగినట్లు తెలుస్తోంది. కరోనా టైమ్‌లో తుమ్మినా, దగ్గినా చీదరింపులు తప్పలేదు. కొంతమందైతే ఏకంగా వాళ్లను గదుల్లో నిర్బంధించిన సందర్భాలు దాఖలాలు లేక పోలేదు. ఇక మంచాన పడిన వృద్ధులకైతే వేధింపులు మరింతగా పెరిగాయి. ఇలాంటి బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వయోవృద్ధుల కేంద్రం ఆధ్వర్యంలో 14567 కాల్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. దీనికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

- భూమి అమ్మేందుకు నిరాకరించారనే నెపంతో నవాబుపేట మండలం పులిమామిడి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులపై వారి కుమారులే దాడిచేసి, విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.
- తాజాగా కొత్తూరు మండల కేంద్రంలో వృద్ధ దంపతులు కొడుకుల చేతిలో దారుణంగా మోసపోయి రోడ్డున పడ్డారు. ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను కూడా లాగేసుకుని ఇంటి నుంచి బయటికి గెంటేశారు. దీంతో న్యాయం కోసం రెండు రోజుల క్రితం జిల్లా వయోవృద్ధుల కేంద్రాన్ని ఆశ్రయించారు.

| కాల్ సెంటర్‌కు వచ్చిన ఫోన్లు | |
|---|---|
| కోవిడ్ సపోర్ట్ కోసం | 46 శాతం |
| విచారణ | 18 శాతం |
| సమాచారం కోసం | 9 శాతం |
| తిట్టడం, కొట్టడం | 7 శాతం |
| పెన్షన్ | 7 శాతం |
| న్యాయం కోసం | 6 శాతం |
| రెస్క్యూ | 4 శాతం |
| ఇతర కాల్స్ | 2 శాతం |
| ఎమోషనల్ సపోర్ట్ కోసం | 1 శాతం |

- చేవెళ్ల మండలం రామన్నగూడకు చెందిన వృద్ధుడు(65) అనారోగ్య సమస్యలకు.. తోడు ఆఖరు మజిలీలో అండగా ఎవరూ లేకపోవడంతో మనస్తాపం చెంది.. ఊరుచివర ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.
- మహేశ్వరం మండలం తుమ్మలూరుకు చెందిన వృద్ధ దంపతులు ఇటీవల బలవన్మరణానికి పాల్పడ్డారు.

#### రక్షణ కల్పించండి

మాకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. అందరి పెళ్లిళ్లు చేశాం. మేం కష్టపడి సంపాదించినదంతా వారికే ధారాదత్తం చేశాం. ప్రస్తుతం వృద్ధాప్యంతో బాధపడుతున్నాం. మమ్మల్ని ఎవరూ చూడటం లేదు. కనీసం పింఛన్ కూడా రావడం లేదు. ఉన్న ఇళ్లు, ఇతర ఆస్తులన్నీ లాగేసుకున్నారు. చిన్న కొడుకు ఇంటి నుంచి బయటికి గెంటేశాడు. ఇదేమని అడిగితే దాడులు చేస్తున్నారు. మాకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాం. అయినా వేధింపులు ఆగలేదు. నోటికొచ్చినట్లు తిట్టడమే కాకుండా నలుగురిలో నవ్వుల పాలు చేస్తున్నారు. మా రెక్కలు ఆడినన్ని రోజులు వారిని సంతోషంగా ఉంచేందుకే ప్రయత్నించాం.

– చాకలి బాలయ్య, బాలమణి, కొత్తూరు

#### ఫిర్యాదు చేయండి



వయోవృద్ధుల సంక్షేమం కోసం కేంద్రం తల్లిదండ్రులు, వయోవృద్ధులు పోషణ చట్టం- 2007ను తీసుకొచ్చింది. 60 ఏళ్లు దాటిన వారికి వర్తిస్తుంది. పిల్లల నుంచి పోషణ ఖర్చులు ఇప్పిస్తారు. బాధితులు రెవెన్యూ డివిజన్ స్థాయిలోని ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై ఆర్డీఓ విచారణ అనంతరం పోషణ ఖర్చులు ఇవ్వాలని ఆదేశిస్తారు. లేదంటే జిల్లా అప్పిలేట్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. పిల్లలకు రాసిచ్చిన ఆస్తులను స్వాధీనం చేసుకునే వీలు కల్పిస్తుంది.

– మోతి, జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి

## న్యూస్‌రీల్

### మీదే 'గురు'తర బాధ్యత

హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్ రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తుర్కయంజాల్: నేటి బాలలే రేపటి పౌరులని, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాసంస్థలతో పాటు ఉపాధ్యాయులదేనని హైకోర్టు న్యాయమూర్తి బి.విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ 6వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రాఘవ రెడ్డి, సుధీర్ రెడ్డి, సంజీవ రెడ్డితో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### 'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి అన్నారు. చేవెళ్లలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు, అలాగే.. 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉంటుందని తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు,7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మే 25 నుంచి 31వ తేదీ వరకు చేస్తారన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### యూటీఎఫ్ మహా సభలను విజయవంతం చేయండి

కొందుర్గు: విద్యా, ఉపాధ్యాయ రంగంలో న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడ బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లేడ్ చౌదరిగూడ మండల శాఖ అధ్యక్షులు శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వలిగే కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభలకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

### గ్రేటర్‌పై చలి పంజా

- పలు ప్రాంతాల్లో 9 నుంచి 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌పై చలి పంజా విసురుతోంది. సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండడం, శీతల గాలులతో సిటీజన్లు గజగజలాడుతున్నారు. బుధవారం నగరంలో పలు చోట్ల 9 నుంచి 11 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శివరాంపల్లిలో అత్యల్పంగా 9.9, మచ్చబొల్లారంలో 11.2, హస్తినాపురం 11.3, పటాన్‌చెరు 11.3, వెస్ట్ మారేడ్‌పల్లి 11.6, నాగోల్ 12.1, హయత్‌నగర్ 12.3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొన్ని చోట్ల 12 నుంచి 14 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో నగరంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

### 'వసంత్ కుమార్' బాటలో హెచ్ఎండీఏ

వారసత్వ కట్టడాల పరిరక్షణకు విశేష కృషి: అర్వింద్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వారసత్వ కట్టడాలు, జల వనరుల పరిరక్షణకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దివంగత వసంత్ కుమార్ చేసిన కృషి అనిర్వచనీయమైనదని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ కొనియాడారు. బుధవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కార్యాలయంలో హుడా వ్యవస్థాపక వైస్ చైర్మన్ దివంగత వసంత్‌కుమార్ భా సంస్మరణ సమావేశం జరిగింది. కార్యక్రమంలో వి.కె. భాతో కలిసి పని చేసిన ఆనాటి హుడా డైరెక్టర్ శౌరే, నాటి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభంజన్, హుడా సీపీఆర్ఓ కృష్ణ భాజీ, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ వ్యవస్థాపకుడు వేదకుమార్, హుడా మాజీ డైరెక్టర్ విశ్వనాథ్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్, హెచ్ఎండీఏ సెక్రెటరీ చంద్రయ్య, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రతిష్టను దిగజార్చొద్దు

- అధిష్టానం నిర్ణయాన్ని అందరూ శిరసా వహించాలి
- కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమని ఆ పార్టీకి చెందిన పలువురు నియోజకవర్గ నేతలు తేల్చిచెప్పారు. పట్టణంలోని వైష్ణవి గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబ్దుల్లాపూర్



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్ జెడ్పీటీసీ దాసుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, యాచారం వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాండు రంగారెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కొంతమంది స్వార్థ నాయకులు తాము చేసుకున్న లోపాయికారీ ఒప్పందాల కోసం పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మల్‌రెడ్డి రంగారెడ్డిని నియమించారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆయన సారథ్యంలో పనిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్నికల సమయంలో బీఫామ్ వచ్చిన వ్యక్తి గెలుపు కోసం తామంతా పనిచేస్తామని తెలిపారు. మల్‌రెడ్డికి వ్యతిరేకంగా గ్రూప్‌లు కడుతున్న నేతలెవరైనా టికెట్ తెచ్చుకుంటే వారి గెలుపుకోసం పాటుపడుతామని స్పష్టంచేశారు. మల్‌రెడ్డి సారథ్యంలో స్థానికంగా కాంగ్రెస్ బలంగా ఉందన్నారు.



ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఫాంలో పెంచుతున్న పందెం కోళ్లు

## కోడి.. రె'ఢీ'

- పందేలకు సిద్ధమైన 'పట్నం' కోళ్లు
- భీమవరం, పాలకొల్లు, గుడివాడ, గుంటూరు, విశాఖకు తరలింపు
- ఒక్కో పక్షి విలువ రూ.లక్ష



ఇబ్రహీంపట్నం రూరల్: సంక్రాంతి పండగకు పందెం కోళ్లు సిద్ధమయ్యాయి. వీటిని ఏపీకి తరలించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏడాది కాలంగా అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి.. బరిలో దింపేందుకు రెడీ అయ్యారు. సంక్రాంతిని పురస్కరించుకుని భీమవరం, పాలకొల్లు, గుడివాడ, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. పందెంలో ఆరితేరిన కోళ్లు కయ్యానికి కాలుదువ్వుతున్నాయి.

#### పట్నంలో పెంపకం

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో పందెం కోళ్ల పెంపకం జోరుగా సాగుతోంది. ఏపీకి చెందిన ఇటుక బట్టీల వ్యాపారులు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, కందుకూరు, మహేశ్వరం ప్రాంతాల్లో పందెం కోళ్లను పెంచుతున్నారు. నగరంలో స్థిరపడిన ఆంధ్ర వ్యాపారులు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, మహేశ్వరం ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి ఫారాల్లో నాటు కోళ్లు, పందెం కోళ్ల సాకుతున్నారు.

#### డేగ, కొక్కెర..

పందెం కోళ్లలో కొక్కెర, సీత్వ, అబ్రాస్, డేగ, మహిశా డేగ, రాగి డేగ తదితర రకాల పక్షులను ఇక్కడ పెంచుతున్నారు. చిన్న పిల్లలుగా ఉన్న సమయంలోనే వీటిని తీసుకొచ్చి ఏడాది పొడవునా చంటిపిల్లల్లా కాపాడారు. ప్రస్తుతం ఇవన్నీ పందేలకు సిద్ధమయ్యాయి.

#### బలవర్ధకమైన ఆహారం

ఒక్కో పందెం కోడి విలువ రూ.లక్ష వరకు పలుకుతోంది. ఇవి బరిలో దిగితే గెలుపే అనే విధంగా తీర్చిదిద్దారు. ఒక్కో ఫామ్‌లో 45 నుంచి 100 కోళ్లను పెంచారు. నిత్యం మాంసం, రాగులు, సజ్జలు, వడ్లు, బాధం, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారం అందించారు. వీటి పోషణ కోసం నెలకు రూ.లక్ష ఖర్చు చేశామని నిర్వాహకులు చెబుతున్నారు.

#### షెడ్లు నిర్మించి పెంపకం



రాయపోల్‌లో కొందరు వ్యాపారులు ప్లాట్లు కొనుగోలు చేశారు. వీటిని ఖాళీగా ఉంచకుండా షెడ్లు నిర్మించి, పందెం కోళ్లను పెంచారు. ప్రస్తుతం ఇవి బరికి సిద్ధమయ్యాయి. ఇష్టముంటే పెంచిన వారే పోటీల్లో పాల్గొంటారు. లేదంటే పందేల నిర్వాహకులకు అమ్మేస్తారు. ఒక్కో కోడి రూ.లక్ష పలుకుతోంది.

– శ్రీశైలం, ఎంపీటీసీ రాయపోల్

#### శివారు ప్రాంతాల్లో..



శివారు ప్రాంతాలను ఎంచుకొని పందెం కోళ్లను పెంచుతున్నారు. మంచాల, యాచారం, ఆదిబట్ల, కొంగరకలాన్, మహేశ్వరం, కందుకూరు ప్రాంతాల నుంచి ఏటా వీటిని ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్నారు. పందెం కోళ్ల పెంపకం ద్వారా పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నారు. ఖర్చు సైతం అదే స్థాయిలో ఉంటోంది.

– మేడిబాయి ఆనంద్, ఇబ్రహీంపట్నం

## డ్రగ్స్‌ను తరిమేద్దాం

- మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం
- వీటికి బానిసలైతే బతుకు అంధకారమే
- మంత్రి సబితారెడ్డి హెచ్చరిక
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

మీర్‌పేట: తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును రాచకొండ పోలీసు కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అలుపెరుగకుండా పనిచేస్తున్నది పోలీసు శాఖ మాత్రమేనని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లోనూ పోలీసులు తమ వంతు పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోకి మాదకద్రవ్యాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎప్పటికప్పుడు నేరస్తులను పట్టుకుని జైలుకు పంపాలన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులతో పాటు సమాజంలోని ప్రతిఒక్కరిపైనా ఉందని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారమవుతుందని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రత కోసమే ప్రభుత్వం షీటీలను కొనసాగిస్తోందని స్పష్టంచేశారు. ఏ ఆపద వచ్చినా నిర్భయంగా ఫిర్యాదు చేస్తే సమస్య నుంచి బయటపడొచ్చని మంత్రి వివరించారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.




మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి, సీపీ డీఎస్ చౌహాన్


#### ప్రాణాల మీదకు వస్తుంది

రాచకొండ పోలీసు కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని, జాలీగా మొదలయ్యే ఈ వికృతానందం వ్యసనంగా మారి ప్రాణాల మీదకు తెస్తుందని హెచ్చరించారు. అతిగా సెల్‌ఫోన్ వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయొద్దని తెలిపారు. మాదక ద్రవ్యాలు, సైబర్ మోసాలపై కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మీర్‌పేట సీఐ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, షీటీమ్ డీసీపీ షేక్ సలీమా, ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శం తెలంగాణ

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కేసీఆర్ తెలంగాణ మహాత్ముడని కితాబు

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఓ ప్రైవేట్ పత్తి జిన్నింగ్ మిల్లును ప్రారంభించారు. అలాగే.. లాల్‌పహాడ్, ముష్టిపల్లిలలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. కేసీఆర్ పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన మొదట్లో హైదరాబాద్ మినహా తొమ్మిది జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రమే దేశంలో మొదటిస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఇది కేసీఆర్ దక్షత, ముందు చూపుతోనే సాధ్యమైందన్నారు. గతంలో రూ.200 పింఛన్ సకాలంలో అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు రూ. 2వేల పింఛన్ ఠంచన్‌గా ఇస్తున్నామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబార్‌లాంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడబోమని హోంమంత్రి స్పష్టం చేశారు. 1969లో చెన్నారెడ్డి సారథ్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో 400 మంది అమరులయ్యారని, అదే కేసీఆర్‌ను.. శాంతియుతంగా ఉద్యమాన్ని నడిపించిందని తెలిపారు. ప్రాణాలకు తెగించి, గమ్యాన్ని ముద్దాడిన ఆయన తెలంగాణ మహాత్ముడని కొనియాడారు.



షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

#### అంజన్న అందరివాడు.. ఆదరించండి

ఎమ్మెల్యే అంజన్న అందరివాడని, అమాయకుడని, అసలు కోపమంటే ఎరుగడని హోంమంత్రి కితాబిచ్చారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న అంజయ్యయాదవ్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, జడ్పీటీసీ స్వరూప, ఆర్డీఓ రాజేశ్వరి, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు, కొందుర్గు వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, ఎంపీటీసీ రజిత, సర్పంచ్ కవిత, టీఆర్ఎస్ మండలాధ్యక్షులు సయ్యద్ హఫీజ్, శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరుచూరి బ్రదర్స్‌కు సన్మానం

గన్‌ఫౌండ్రీ: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు, యువకళావాహిని ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ఎన్టీ రామారావు శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరు చూరి గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావులకు ఎన్టీ ఆర్ విశిష్ట రచనా పురస్కారాన్ని ప్రదా నం చేశారు. అనంతరం కేవీ రమణాచారి మాట్లాడుతూ పరుచూరి బ్రదర్స్ ఎంతో మంది రచయితలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు.



## ఔటర్‌పై రెండు కార్లు ఢీ..

**ముగ్గురికి గాయాలు**



ప్రమాదస్థలిలో ధ్వంసమైన కార్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై రెండు కార్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. మణికొండలో నివాసం ఉండే పుట్టు ఆండాలు, శ్రీచరణ్‌లు నానమ్మ మనుమడు డ్రైవర్ వెంకటేశ్‌తో కలిసి ఘట్కేసర్‌కు వెళ్తున్నారు. బొంగ్లూరు సమీపంలోకి రాగానే ఎగ్జిట్ నెం.12 వద్ద ఉదయం 11గంటలకు వెనుకనుంచి వచ్చిన కియా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నానమ్మ, మనుమడు, డ్రైవర్ వెంకటేష్ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని డీఆర్‌డీఎల్ అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కియా కార్‌డ్రైవర్ రెడ్డిగారి నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.



# భారత్ vs కివీస్

**కనీస టికెట్ ధర రూ. 850..**

- ఈ నెల 18న ఉప్పల్‌లో వన్డే మ్యాచ్
- 13 నుంచి 16 వరకు అమ్మకాలు



సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 22, 2022... భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే టి20 మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసేందుకు సికింద్రాబాద్ జింఖానా మైదానానికి వచ్చిన అభిమానులు... సరైన ఏర్పాట్లు లేక తోపులాట... పోలీసుల రంగప్రవేశం... ఏడుగురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు... ఈ ఘటనను క్రికెట్ అభిమానులు ఎవరూ మరచిపోలేరు. గతానుభవం నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పాఠం నేర్చుకుంది. ఫ్యాన్స్ అడిగారంటూ గత మ్యాచ్ సమయంలో 'ఆఫ్‌లైన్'లో కౌంటర్ ద్వారా పరిమిత సంఖ్యలో టికెట్ల అమ్మకాలు ప్రారంభించి తీవ్ర రచ్చకు కారణమైన హెచ్‌సీఏ ఈసారి అలాంటి పొరపాటు జరగకుండా టికెట్ల అమ్మకంపై ముందే స్పష్టతనిచ్చేసింది. ఈ నెల 18న ఉప్పల్ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. దీనికి సంబంధించిన మొత్తం టికెట్లన్నీ 'ఆన్‌లైన్' ద్వారానే అమ్ముతామని... 'పేటీఎం' వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేయాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజహరుద్దీన్ వెల్లడించారు. హెచ్‌సీఏ కార్యదర్శి విజయానంద్, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు వంకా ప్రతాప్‌తో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. 2019 మార్చి 2న భారత్, ఆస్ట్రేలియా తలపడిన తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న వన్డే మ్యాచ్ ఇదే. కలెక్షన్ పాయింట్‌ల వద్ద కూడా ఎలాంటి గందరగోళం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అజహర్ చెప్పారు.

**టికెట్ల అమ్మకాల వివరాలు** Paytm

- **మ్యాచ్ తేదీ:** జనవరి 18, మధ్యాహ్నం గం.1:30 నుంచి
- **అందుబాటులో ఉన్న టికెట్లు:** 29,417
- **టికెట్ల ధరలు (కార్పొరేట్ బాక్స్ టికెట్ సహా):** రూ. 850, రూ.1000, రూ. 1250, రూ. 1500, రూ. 2,500, రూ. 5,000, రూ.7,500, రూ.9,000, రూ.10,000, రూ. 17,700, రూ. 20,650.
- **అమ్మకాల తేదీలు:** జనవరి 13, 14, 15, 16 (ప్రతి రోజూ సా. 5 గంటల నుంచి)... తొలి రోజు 6 వేలు, రెండో రోజు 7 వేలు, మూడో రోజు 7 వేలు, నాలుగో రోజు మిగిలిన టికెట్లు అందుబాటులో ఉంటాయి.



**ఎక్కడ: 'పేటీఎం' వెబ్‌సైట్‌లో (ఒక్కొక్కరు గరిష్టంగా 4 టికెట్లే కొనవచ్చు)**

ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసే సమయంలోనే దానిని మార్చుకునే 'కలెక్షన్ పాయింట్'ను ఎంచుకోవాలి. క్యూఆర్ కోడ్ చూపిస్తే అక్కడ 'ఫిజికల్ టికెట్' ఇస్తారు. ఇది ఉంటేనే స్టేడియంలోకి అనుమతిస్తారు. మార్చుకునే సమయంలో ఏదైనా గుర్తింపు పత్రం (ఐడీ కార్డు) తప్పనిసరి.

**కలెక్షన్ పాయింట్‌లు:**
ఎల్బీ స్టేడియం, జీఎంసీ బాలయోగి స్టేడియం-గచ్చిబౌలి (జనవరి 15 నుంచి ఉదయం. గం. 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య)

## అనారోగ్యమా.. ఆర్థిక ఇబ్బందులా..?

**మిస్టరీగానే వృద్ధ దంపతుల మృతి**

అబ్దుల్లాపూర్‌మెట్: వృద్ధ దంపతుల మృతి మిస్టరీగానే మిగిలింది. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాగారం హనుమంతు (65), భార్య వెంకటమ్మ (50) మృతి చెందిన విషయం విదితమే. వీరు సోమవారం రాత్రి ఆహారంలో విషం కలుపుకుని తిన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే పోస్టుమార్టంలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వారు తీసుకున్న ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధ దంపతులిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో వారికి అనారోగ్య సమస్యలున్నాయా..? లేదా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా..? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వృద్ధాప్యంలో కన్నవారికి భారం కాకూడనే వృద్ధులిద్దరూ కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పలువురు భావిస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా.. పోలీసుల దర్యాప్తు అనంతరం మృతికి గల కారణాలు బయటపడే అవకాశాలున్నాయి.



హనుమంతు, వెంకటమ్మ దంపతులు(ఫైల్)

## సమాజాన్ని కదిలించేది కవిత్వం

గన్‌ఫౌండ్రీ: ప్రజలను జాగృతం చేసే బలమైన సాధనం కవిత్వమని, ఇది సమాజాన్ని కదిలిస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో డాక్టర్ రవిశంకర్ రచించిన 'ఔషధం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొంటున్న విద్వేషాలను నివారించడానికి మనుషుల మధ్య ప్రేమను పంచడానికి సాహిత్యం తోడ్పడుతుందని, మానవ సంబంధాల మధ్య వంతెనగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, పాత్రికేయుడు వర్దెల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మైదానాల ఏర్పాటుకు కృషి

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గ పరిధిలో మైదానాల ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూరులో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామానికి ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిందన్నారు. కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో 5ఎకరాల చొప్పున స్థలం కేటాయించి మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, ఎంపీపీ కృపేష్, సర్పంచ్‌లు రాంరెడ్డి, గీత, కవిత, యాదగిరి, ఎంపీటీసీ భరత్‌రెడ్డి , శ్రీశైలం, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ఆదిబట్ల అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ చోరీ

**డ్రైవర్లను తల్వార్లతో బెదిరించి దుండగులు పరార్**

కొత్తూరు: జాతీయ రహదారిపై నిరంతరం పోలీసుల నిఘా... ఓ వైపు హైవే పెట్రోలింగ్, మరో వైపు పోలీసుల బందోబస్తు .. అయినప్పటికీ కొందరు దుండగులు రోడ్డు పక్కనే నిలిపిన వాహనాల్లో నుంచి డీజిల్, డ్రైవర్లను బెదిరించి నగదు దోచుకెళ్తున్నారు. తాజాగా బుధవారం తెల్లవారు జామున దుండగులు రెండు లారీలనుంచి 400లీటర్ల డీజిల్ దొంగిలించారు. ఈ ఘటన కొత్తూరు పీఎస్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి జేపీదర్గా కూడలి వద్ద చోటు చేసుకుంది. డ్రైవర్ కమలాకర్‌బిండ్వే తెలిపిన ప్రకారం .. మహారాష్ట్రకు చెందిన రెండు లారీలు గుజరాత్ నుంచి ప్లాస్టిక్ ముడిసరుకుతో చెన్నైకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో ఉదయం 4.30గంటల ప్రాంతంలో ఇద్దరు డ్రైవర్లు జేపీదర్గా కూడలి సమీపంలో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి లారీ క్యాబిన్‌లో నిద్రకు ఉపక్రమించారు. కాసేపటికే లారీల వెనుకభాగంలో శబ్దం రావడంతో కిందకి దిగి పరిశీలించారు. అప్పటికే రెండు లారీల నుంచి సుమారు 400 లీటర్ల డీజిల్‌ను దొంగలించి చిన్న ట్రాలీలో నింపుకున్నారు. ఈ క్రమంలో దొంగలను అడ్డుకోబోయిన డ్రైవర్లను తల్వార్లతో బెదిరించి అక్కడ నుంచి పరారయ్యారు. వెంటనే లారీ డ్రైవర్లు స్థానికుల సాయంతో కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఘటనపై ఫిర్యాదు చేశారు.



దుండగులు ధ్వంసం చేసిన డీజిల్ ట్యాంకు

## బాలిక అదృశ్యం



మమత (ఫైల్)

షాబాద్‌షరీఫ్: ఓ బాలిక అదృశ్యమైంది. ఈ సంఘటన షాబాద్‌షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన యాదయ్య, మంగమ్మ దంపతుల కూతురు మమత(17)ను ఇంటి వద్ద వదిలి ఈ నెల 9న సొంతూరు కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి వెళ్లారు. అదేరోజు రాత్రి తిరిగి వచ్చి చూడగా మమత కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17241 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## వామ్మో.. కొండముచ్చులు!

- శేరిగూడలో ప్రజలపై దాడి
- 12మందికి గాయాలు

షాద్‌నగర్ రూరల్: మండల పరిధిలోని శేరిగూడలో జనంపై కొండముచ్చులు దాడి చేశాయి. ఈ ఘటనలో పది మందికి స్వల్ప గాయాలవ్వగా మరో ఇద్దరు తీవ్రంగా పడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పదిరోజుల క్రితం శేరిగూడకు కొండముచ్చుల గుంపు వచ్చింది. గ్రామ ప్రజలపై దాడికి యత్నిస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి గ్రామంలోని దేవాలయం సమీపంలో నుంచి వెళ్తున్న సాత్విక్‌రెడ్డి, గజ్జెల వెంకటయ్యపై కొండముచ్చులు దాడి చేశాయి. దీంతో వారికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సాత్విక్‌రెడ్డి, వెంకటయ్యను చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌కు తరలించి చికిత్స అందించారు. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం, అధికారులు స్పందించి కొండముచ్చులను తరమికొట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.